ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

సనత్‌నగర్: కిలో..రూపాయల్లో.. టమాటా.39, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 45, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 28, మొరంగడ్డ 28, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన ట్రాఫిక్ ఏఎస్ఐ శ్యామల



పతకాలు సాధించిన బేగంపేట ట్రాఫిక్ ఏఎస్ఐ శ్యామల..

సనత్‌నగర్: జింఖానా గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ఆఫ్ సీజన్ తెలంగాణ స్టేట్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్యామల సత్తా చాటారు. డిస్కస్ త్రో పోటీల్లో బంగారు పతకం, షాట్‌పుట్ పోటీల్లో సిల్వర్ పతకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా నేషనల్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌పటేల్ చేతుల మీదుగా ఆమె పతకాలు అందుకున్నారు.

పాలక మండలి సభ్యుల నియామకంలో నిర్లక్ష్యం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పాలక మండలి సభ్యుల (ఈసీ మెంబర్స్) నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం అశ్రద్ధ చూపుతుందని ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య ఆదివారం ధ్వజమెత్తారు. గత పాలక మండలి సభ్యుల పదవీ కాలం ముగిసి ఏడాది దాటినా కొత్త సభ్యుల నియామకాల పట్ల ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత కొంత కాలంగా కేవలం ముగ్గురు పాలక మండలి సభ్యులతోనే సమావేశాలు నిర్వహించడం వలన ఓయూలో అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



వలంటీర్లకు బహుమతులు అందిస్తున్న ఏసీపీ

రాంగోపాల్‌పేట్: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించడం కోసం ఆదివారం టాప్ డ్రైవర్స్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ ఎక్స్‌పోను సంగీత్ థియేటర్ ప్రాంతంలోని అవర్ సేక్రిడ్ స్పేస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని దీనిపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఇప్పుడు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. టాప్ డ్రైవర్ ఇండియ వ్యవస్థాపకులు శ్రీనరేష్, హైదరాబాద్ ట్రాఫిక్ మాన్ లేకేంద్ర, టీం రోడ్ స్క్వాడ్ ప్రతినిధులు శ్రీహర్ష పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలు అందజేత



ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న రాజలక్ష్మీ ఆనంద్

సనత్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పలువురు లబ్ధిదారులకు మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను ఆదివారం బేగంపేట డివిజన్ బీజేపీ నాయకురాలు రాజలక్ష్మీ ఆనంద్ అందజేశారు. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని బీజేపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత నెమలి ఆనంద్, మైసూరు మధుసూదన్, మహేష్, శ్రవణ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

‘అంతర్గతం’.. అధ్వానం

గుంతలమయమైన ఇంటర్నల్ రహదారులు

- వాడవాడలా ప్రమాదకర పరిస్థితులు
- రూ.10 కోట్ల రోడ్ల పనులు రద్దు
- లష్కర్‌లో ఇదీ రోడ్ల దుస్థితి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అంతర్గత రహదారులు ఇటీవల వర్షాలకు అధ్వాన్నంగా తయారయ్యాయి. ఎక్కడికక్కడ గుంతలమయం అయిపోయి ప్రమాదకర పరిస్థితికి చేరాయి. రేండేళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిధులు మంజూరైనా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ ఐదు డివిజన్ల పరిధిలో రూ.10 కోట్లతో సిద్ధం చేసిన అంతర్గత రహదారుల నిర్మాణం పనులు ఎక్కడికక్కడ పడకేశాయి. పాత రోడ్లు వరద కోతకు గురై మరింత ప్రమాదకరంగా మారడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు.

◆ గత ప్రభుత్వ హయాంలో రహదారుల నిర్మాణానికి రూపొందించిన ప్రతిపాదనలు, సదరు నిధులు మొత్తంగా రద్దు చేసినట్టు తాజాగా జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని రహదారుల నిర్మాణం కోసం టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కూడా నిర్మాణం సమయంలో చేతులు ఎత్తేస్తుండడంతో రహదారుల నిర్మాణం పనులు ప్రారంభమే కావడం లేదు. రోడ్ల నిర్మాణం విషయం జాప్యం జరుగడానికి జలమండలి అధికారులు వ్యవహరిస్తున్న తీరు కూడా అడ్డంకిగా మారుతోంది.



ఇందిరానగర్ అంతర్గత రహదారి

గుంతలు... ప్రమాదకరం...

ఐదు డివిజన్లలోని 20 రోడ్ల నిర్మాణం పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు అలా ప్రారంభించి ఇలా నిలిపివేశారు. ఐదు డివిజన్ల పరిధిలో ఇంటర్నల్ రోడ్డు నిర్మాణం పనుల కోసం ఏడాది క్రితం కొత్త టెండర్లు ఖరారు చేసిన అధికారులు నిర్మాణం పనులు ప్రారంభించడంలో మాత్రం సాంకేతిక కారణాలు చూపుతున్నారు.

◆ దాదాపుగా నియోజకవర్గం మొత్తం మీద వంద రోడ్ల వరకు చెడిపోయాయని అధికారులే పేర్కొంటున్నారు. ఈ రహదారులు ఇటీవలి నిరాటంక వర్షాలకు పూర్తిగా ప్రమాదకరంగా పరిణమించాయి. కొన్ని రహదారుల్లో ద్విచక్రవాహనాలు కాదుకదా పాదచారులు నడిచేందుకు కూడా వీలు లేని దుస్థతికి రహదారులు చేరాయి.



సీతాఫల్‌మండిలోని మేడిబావి రహదారి

ప్రత్యేక చర్యలు తీసుకోవాలి...

అర్ధంతరంగా నిలిచిపోయిన రహదారుల నిర్మాణం విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, జలమండలి అధికారులు నిర్లక్ష్య ధోరణి విడనాడాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణ ప్రతిపాదనల సమయంలోనే ఇరు విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచిస్తున్నారు.

◆ రహదారుల నిర్మాణానికి సకాలంలో నిధులు విడుదల చేయించి కాంట్రాక్టర్లతో పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయించేందుకు అధికారులు, పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వేలు చేస్తున్నాం

ఇటీవలి వర్షాలకు ప్రమాదకరంగా పరిణమించిన రహదారుల పరిస్థితిపై సర్వే నిర్వహిస్తున్నామని జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు. పూర్తిగా ప్రమాదకరంగా మారిన రహదారులకు ప్యాచ్‌వర్క్‌లు ప్రారంభించామని చెప్పారు. సర్వే నివేదిక రూపొందించాక రహదారి పరిస్థితుల ప్రాతిపదికన కొత్త రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. రహదారుల నిర్మాణం విషయంలో ముందస్తుగా జలమండలి, విద్యుత్‌శాఖల అధికారులను సమన్వయం చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నందున నిధులు మంజూరై ఉన్న రోడ్ల నిర్మాణంలోనూ జాప్యం తప్పడం లేదంటున్నారు.

కలగా కమ్యూనిటీహాల్ నిర్మాణం

- గత ప్రభుత్వంలో రూ.40 లక్షలు మంజూరు..
- దాదాపు 10 బస్తీలకు పైగా ఉపయోగం

సనత్‌నగర్: దాదాపు 10 బస్తీలు..ఏదైనా శుభకార్యం చేసుకోవాలన్నా.. సమావేశం పెట్టుకోవాలన్నా.. పండుగలు, పబ్బాలు జరుపుకోవాలన్నా..ఒక్కటంటే ఒక్కటి కూడా కమ్యూనిటీ హాల్ లేదు. బేగంపేటలోనిఅంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ పక్కనే ఆనుకుని ఉన్న ఆ బస్తీల్లోని ఇళ్లల్లో ఏదైనా ఫంక్షన్ జరుపుకోవాలంటే రోడ్లే దిక్కు. ఇదీ బేగంపేట డివిజన్ శ్యాంలాల్‌బిల్డింగ్స్ పరిసర బస్తీల ప్రజల వెతలు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గత ప్రభుత్వ హయాంలో ఇక్కడి బస్తీల ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా కమ్యూనిటీహాల్ నిర్మాణానికి చొరవ తీసుకోవడమే కాకుండా రూ.40 లక్షల నిధులు కూడా మంజూరు చేయించారు. ఇంతవరకు ఆ పనులు పట్టాలెక్కలేదు సరికదా.. మంజూరైన నిధులు ఎటుపోయాయో అధికారులకే ఎరుక.

అన్ని హంగులతో నిర్మించేందుకు ప్రణాళికలు..

శ్యాంలాల్‌బిల్డింగ్స్ పరిసర బస్తీలను కలుపుకుని దాదాపు 30 వేల వరకు జనాభా ఉంటుంది. ఆయా బస్తీలకు సరైన కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో ప్రైవేటు ఫంక్షన్‌హాల్స్ నిర్వాహకులను ఆశ్రయించి వేలకు వేల చెల్లించాల్సి వస్తోంది. ముఖ్యంగా తాతాచారికాలనీ, ఎరుకల బస్తీ, గురుమూర్తిలేన్, బొంబే హల్వా కాంపౌండ్, ఇందిరాగాంధీపురం తదితర బస్తీల ప్రజలు ఏదైనా శుభకార్యం చేసుకోవాలంటే దగ్గరలో అందరికీ ఉపయోగపడే రీతిలో సరైన కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాటిగడ్డలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ఉన్నప్పటికీ దూరభారం కావడంతో ఆసక్తి కనబరచడం లేదు. ఈ క్రమంలో తాతాచారి కాలనీ గ్రౌండ్ విశాలంగా ఉండడంతో పాటు చుట్టుపక్కల బస్తీలకు ఎంతో అనువుగా ఉండడంతో ఇక్కడ అన్ని హంగులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరపాలని రూ.40 లక్షల మంజూరు చేశారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు ప్రారంభించలేకపోయారు. ఎన్నికలు ముగిశాయి, కొత్త ప్రభుత్వం కొలువుదీరి సంవత్సరన్నర దాటినా ఇక్కడి కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఊసెత్తడం లేదు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరపాలని ప్రణాళికలు రూపొందించిన తాతాచారికాలనీ గ్రౌండ్ ఇదే..

ఎమ్మెల్యే పట్టుబట్టి నిధులు మంజూరు చేయించారు



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇక్కడి కమ్యూనిటీ హాల్ నిర్మాణం గురించి అసలు పట్టించుకోవడం లేదు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం మంజూరైన నిధులు ఏమయ్యాయో తెలియదు. నిర్మాణంపై దృష్టిసారించాలి. ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో ఎంతోమందికి ఉపయోగకరంగా ఉంటుంది.

– సురేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తాం



భూగర్భ డ్రైనేజీ లైను పనులు ప్రారంభిస్తున్న బోర్డు సభ్యురాలు భానుక నర్మద

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఆధునికీరిస్తామని బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద అన్నారు. ఆరోవార్డు చంద్రగిరి కాలనీలో రూ.15 లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ లైను పనులను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భానుక నర్మద మాట్లాడుతూ తాను బోర్డు సభ్యురాలిగా ఉన్నప్పుడు 12 ఏళ్ల క్రితం చంద్రగిరి కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు చేయించామన్నారు. మళ్లీ తన హయాంలోనే ఆధునీకరిస్తున్నామని తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం సేకరించిన భూముల పరిహారం నిధులు రూ.303 కోట్లతో కంటోన్మెంట్‌లో రికార్డు స్థాయిలో అభివృద్ధి కొనసాగుతుందన్నారు. నాలాల విస్తరణ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు ప్రతీక్ జైన్, బీజేపీ సీనియర్ నాయకులు బాణాల శ్రీనివాస్ రెడ్డి, కాలనీ వాసులు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఖబరస్థాన్ సమస్య పరిష్కారానికి కృషి



మసీదు కమిటీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని ముస్లింల ఖబరస్థాన్ సమస్య పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. ఆదివారం సనత్‌నగర్‌కు చెందిన పలు మసీదు కమిటీల ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాయలంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. తమకు ఖబరస్థాన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, సుదూర ప్రాంతాల్లోని ఖబరస్థాన్‌లకు తీసుకువెళుతున్నామని పేర్కొన్నారు. తమ ప్రాంతంలో స్థలం లేని కారణంగా బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని ఖబరస్థాన్‌లో ఖననం చేసుకునేలా అక్కడి కమిటీని ఒప్పించేందుకు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ సనత్‌నగర్‌లో ఖబరస్థాన్ ఏర్పాటుచేసేందుకు ప్రయత్నం చేశాని, కానీ అందుకు అవసరమైన స్థలం అందుబాటులో లేదని వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మసీదు కమిటీ అధ్యక్షులు మహ్మద్ నోమాన్, మాజిద్, యాకుబ్, రహీం, జమీర్, షంషేర్ తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్ బారిన పడొద్దు : రామకృష్ణ

కంటోన్మెంట్: యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా, జాతీయ సమైక్య భావనను పెంపొందించుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు, బీజేపీ నేత జే. రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ ఐదోవార్డులో నిర్వహించిన తిరంగా యాత్రకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సంజీవయ్య నగర్ పార్కు నుంచి ప్రారంభమై వీకర్స్ సెక్షన్, సంజీవయ్య నగర్, మహాత్మా గాంధీ నగర్, వాల్మీకి నగర్, వాల్మీకి సమాజ్, సెకండ్ లక్ష్మీనగర్ గుండా సాగింది. యువకులకులంతా జాతీయజెండా చేతబూని దారిపొడవునా ‘భారత్ మాతా కి జై’, ‘వందే మాతరం’, ‘డ్రగ్స్ మానండి జీవితాలను ప్రేమించండి’ అంటూ నినాదాలు చేస్తూ ఉప్పొంగిన ఉత్సాహంతో ముందుకు కదిలారు. బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ కో కన్వీనర్ జేవీ నర్సింగ్ రావు, కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయానంద్ పాల్గొన్నారు.



కంటోన్మెంట్ ఐదోవార్డులో బీజేపీ నేత తిరంగా యాత్ర

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ సబిహాబేగం

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో మోతీనగర్ సమీపంలోని గాయత్రీ నగర్ రాక్‌గార్డెన్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ పల్మనాలజిస్ట్, హాస్పటల్ ఎండీ నాగరాజు, కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్ రాధ, జనరల్ ఫిజిషియన్ మౌనికల బృందం హాజరై వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా పల్మనాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, డెంటల్ తదితర వైద్య పరీక్షలు జరిపారు. దాదాపు 250 మంది హాజరై వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. అల్లాపూర్ కార్పొరేటర్ సబీహాబేగం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో గాయత్రీనగర్ అధ్యక్షుడు కృష్ణారావు, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ సత్తాచాటాలి

మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంఘటితమై జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో త్వరలో జరుగనున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి పార్టీ సత్తా చాటాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ కోరారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్‌లో పాదయాత్రతో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం టీడీపీ సీనియర్ నేత నారాయణస్వామి నివాసంలో ఆయన కుమారుడు రామచంద్రరావుతో కలిసి సమావేశమయ్యారు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన నారాయణస్వామి లాంటి సీనియర్ నేతలు కాంగ్రెస్ పార్టీకి అవసరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోని రావాలని ఆయనను ఆహ్వానించారు. తన అభిమానులు, కుటుంబ సభ్యులతో చర్చించి నిర్ణయం చెబుతానని నారాయణస్వామి ఈ సందర్భంగా వెల్లడించారు. నేతలు మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, ఆకాష్, సర్దార్, ఖాజా, గణేష్ యాదవ్, షఫీ, శ్రీనివాస్, జహంగీర్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి చాంపియన్ క్రీడా పోటీలను ఆదివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు సీఈవో మధుకర్ నాయక్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలకు వయస్సుతో సంబంధం లేదని.. క్రీడలవల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి మల్లారెడ్డి, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్‌జిమ్ ప్రారంభం



ఓపెన్‌జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భానుక నర్మద

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఎనిమిది వార్డుల పరిధిలో పైలెట్ ప్రాజెక్ట్ క్రింద వివిధ కాలనీలలో బోర్డు నిధులు వెచ్చించి ఓపన్‌జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు బోర్డు నామినేటేడ్ సభ్యురాలు భానుక నర్మద తెలిపారు. బోర్డు రెండవ వార్డు అవంతి కాలనీలో ఆదివారం ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు ఆహారపు అలవాట్లల్లో అనేక మార్పులొచ్చాయని అలసట, ఒత్తిడి ప్రతి ఒక్కరిలో అధికమయ్యాయని వీటిని అధిగమించడానికి ప్రతి ఒక్కరు వ్యాయమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వార్డు అధ్యక్షుడు శ్రవణ్, అశోక్, కాలనీ అధ్యక్షుడు కేతన్, మధు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పణ



లాలాపేట: తార్నాక చింతల్ బస్తీలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం చింతల్ బస్తీ నాయకులు జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా బస్తీ నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాల్లో నుంచి బాబా సాహెబ్ అంబేద్కర్ ఉన్నత విద్యను అభ్యసించి ప్రపంచ మేధావిగా గుర్తింపు తెచుకున్నారు. కార్యక్రమంలో తుంగ లక్ష్మణ్, హరిబాబు, మనోహర్, ప్రసన్న తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



పోచమ్మ అమ్మవారి ఆలయానికి వస్తున్న కమిటీ సభ్యులు



బోనంతో యువతి

రసూల్‌పురా: శ్రావణమాస బోనాల జాతరలో భాగంగా కంటోన్మెంట్ బోర్డు పరిధి లోని అన్నానగర్ పోచమ్మ,పెద్దమ్మ, మైసమ్మ, మహంకాళి, చిత్తారమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు మేళతాళాలతో, బ్యాండ్ బాజాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు నామినేటేడ్ సభ్యురాలు భానుక మల్లికార్జున్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, సదా కేశవరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

బోయిగూడలో..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారి దేవాలయాలకు తరలి వచ్చి పసుపు కుంకుమలతో పూజలు చేసి బోనాలు, అమ్మవారికి సాకను సమర్పించారు. బోనాల వేడుకలతో బోయిగూడ పరిసర ప్రాంతాల ప్రజలు భక్తిసంద్రంగా మారాయి. బోయిగూడ రైల్ కళారంగ్ బస్తీలోని శ్రీ నల్ల పోచమ్మ, బద్దిపోచమ్మ తదితర దేవాలయాల్లో బోనాల వేడుకల సంబరాలు అంబరాన్ని తాకాయి. నల్లపోచమ్మ దేవాలయంలో జరిగిన బోనాల వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, లక్ష్మీపతి, వెంకటేషన్ రాజు, బీజేపీ నాయకులు టి. రాజశేఖర్ రెడ్డి, హరినాథ్ నాయి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఫలహారపు బండి ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. ఆలయ కమిటీ సభ్యులు గణేష్, ప్రవీణ్, వెంకట్, జితేందర్, నర్సింగ్‌రావు, రాజు, మురళీ, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.





పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేష్, గజ్జెల నాగేష్





బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడలో..